నమస్తే తెలంగాణ

మహబూబాబాద్

5 | సోమవారం 1 జూలై 2024 | MAHABUBABAD

- గోల్డ్‌స్మిత్ పరారీ కేసులో బాధితులకు బెదిరింపులు..
- తీసుకున్న బంగారం తెచ్చి ఇవ్వాలని హుకుం..
- భయాందోళనకు గురవుతున్న బాధితులు

కక్కుర్తి పోలీస్ !



సుబేదారి, జూన్ 30 : ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఓ పోలీస్ తన కక్కుర్తి బుద్ధిని బయటపెట్టుకున్నాడు. తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన బాధితులకు చుక్కలు చూపిస్తున్నాడు. 'చెప్పినట్లు వింటారా.. లేకపోతే పట్టుకొచ్చి లోపలేయాలా' అంటూ బెదిరిస్తుండడంతో బాధితులు గజగజా వణికిపోతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ పరిధిలో ఓ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న స్టేషన్ ప్రాంతంలో ఒక స్వర్ణకారుడు బంగారు ఆభరణాల తయారీ షాపు నిర్వహిస్తున్నాడు. ఇటీవల చాలామంది కస్టమర్ల నుంచి పెద్దమొత్తంలో గోల్డ్ తీసుకున్నాడు. ఈ క్రమంలోనే హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఓ బాధితుడు తనకు చాలాకాలం నుంచి పరిచయమున్న సదరు స్వర్ణకారుడికి కొద్ది రోజుల క్రితం రూ.7లక్షలకు పైగా విలువ చేసే 85 గ్రాముల గోల్డ్ బిస్కెట్ కాయిన్ ఇచ్చి రసీదు తీసుకున్నాడు. అయితే ఇటీవల ఆ స్వర్ణకారుడు బంగారంతో పరారయ్యాడు. విషయం తెలిసిన బాధితులు అతడి షాపు వద్దకు వెళ్లి సిబ్బందిని నిలదీశారు. కమలాపూర్‌కు చెందిన బాధితుడు కూడా షాపునకు వెళ్లి సిబ్బందిని నిలదీయగా పాత పరిచయం ఉండడంతో 50 గ్రాముల బంగారం అతడికి ఇచ్చారు. ఇదే సమయంలో మరికొంత మంది బాధితులు తమకు న్యాయం చేయాలని స్థానిక ఇన్స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పరారైన స్వర్ణకారుడి వద్ద పనిచేసే సిబ్బందిని విచారణ కోసం ఇన్స్పెక్టర్ స్టేషన్‌కు పిలిపించి ఎంతమంది వద్ద ఎంతెంత బంగారం తీసుకున్నారు? ఎవరెవరికి ఇచ్చారు? అనే వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. అనంతరం బాధితులకు ఫోన్ చేసి 'మీరు తీసుకున్న బంగారం తిరిగి ఇవ్వాలి' అని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగా కమలాపూర్‌కు చెందిన బాధితుడికి ఇన్స్పెక్టర్ ఫోన్ చేసి తీసుకున్న 50 గ్రాముల బంగారం తీసుకొచ్చి ఇవ్వాలని బెదిరించాడు. దీంతో బాధితుడు 'నేను ఇచ్చిన 85 గ్రాముల బంగారంలో నాకు ఇచ్చింది 50 గ్రాములే.. ఇంకా 35 గ్రాముల బంగారం రావాలి.. రసీదు, ఫోన్ కాల్స్ రికార్డ్సు ఉన్నాయి సార్' అని మొరపెట్టుకున్నా ఆ ఇన్స్పెక్టర్ వినలేదని తెలిసింది. 'స్టేషన్‌కు వస్తావా? రావా?.. లేదంటే పట్టుకొచ్చి లోపలేస్తా'..అని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. దీంతో బాధితుడు భయాందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పరారైన స్వర్ణకారుడి నుంచి బంగారం ఇప్పిస్తానని ఆ ఇన్స్పెక్టర్ కొంతమంది బాధితుల నుంచి డబ్బులు కూడా తీసుకున్నట్లు తెలుస్తున్నది.

ఏసీబీ అదుపులో వరంగల్ ఆర్డీవో

- భూసేకరణ పరిహారం పంపిణీలో అక్రమాలు
- ప్రతిఫలంగా కుటుంబ సభ్యుల ఖాతాల్లో డబ్బు జమ
- అసిఫాబాద్ జిల్లాలో ఘటన..
- వరంగల్‌లో సిడాం దత్తును అరెస్ట్ చేసిన అధికారులు

వరంగల్, జూన్ 30 (నమస్తే తెలంగాణ) : భూసేకరణలో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు వరంగల్ రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీవో) సిడాం దత్తును అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కుమ్రం భీం అసిఫాబాద్ జిల్లాలో జరిగిన ఈ అక్రమాలపై ఏసీబీ అధికారులు ఆయనను విచారిస్తున్నట్లు సమాచారం. దత్తును ఏసీబీ అధికారులు వరంగల్ ఆర్డీవో కార్యాలయం నుంచి తీసుకెళ్లడం రెవెన్యూశాఖలో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. సిడాం దత్తు ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ముందు బదిలీపై వరంగల్ ఆర్డీవోగా వచ్చారు. గతంలో ఈయన అసిఫాబాద్ ఆర్డీవోగా పనిచేశారు. ఆ సమయంలో అసిఫాబాద్ పట్టణాన్ని ఆనుకొని ఉన్న జన్కాపూర్ శివారు ప్రాంతం మీదుగా 363 జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. ఫలితంగా జన్కాపూర్ శివారులో అప్పటికే రెండు సర్వే నంబర్లలోని భూమిలో సుమారు 15 ఎకరాల్లో వెలిసిన వెంచర్‌లో లేఅవుట్లకు సంబంధించిన 6.12 ఎకరాలను 363 జాతీయ రహదారి నిర్మాణం కోసం సేకరించినట్లు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో పేర్కొన్నారు. ఈ భూమికి పరిహారంగా ప్రభుత్వం నుంచి రూ.4.32 కోట్లు మంజూరయ్యాయి. సదరు వెంచర్‌లో రహదారుల నిర్మాణం కోసం వదిలిన స్థలానికి మంజూరైన పరిహారాన్ని స్థానిక గ్రామ పంచాయతీకి ఇవ్వాల్సి ఉండగా, ఈ వెంచర్ చేసిన స్థిరాస్తి వ్యాపారులు అక్రమంగా తీసుకున్నారు. దీనిపై ఫిర్యాదు అందడంతో ప్రభుత్వం విచారణ చేపట్టింది. ధరణి పోర్టల్‌లో వ్యాపారుల పేర్లు ఉండడం వల్ల పరిహారం పక్కదారి పట్టినట్లు విచారణలో అధికారులు గుర్తించారు. అంతే కాదు.. వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసిన వ్యక్తులకు సైతం పరిహారం అందినట్లు తెలిసింది. స్థిరాస్తి వ్యాపారులకు అయాచితంగా ప్రభుత్వం నుంచి పరిహారం డబ్బు అందేలా ఆ సమయంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు సహకరించినట్లు సర్కారు దృష్టికి వచ్చింది. ప్రతిఫలంగా వ్యాపారుల్లో ఒకరి వద్ద పనిచేసిన డ్రైవర్ బ్యాంకు ఖాతాలో జమ అయిన రూ.1,15,19,000 నుంచి ఆర్డీవో దత్తు తల్లి మల్కుబాయి ఖాతాలోకి రూ.65 లక్షలు, డిప్యూటీ తహసీల్దార్ మేస్రం నాగోరావు సోదరుడు మేస్రం చత్రుషా ఖాతాలోకి రూ.30 లక్షలు బదిలీ జరిగినట్లు విచారణలో తేలింది. సర్వేయర్ భరత్‌కు రూ.10 లక్షల నగదుతోపాటు రూ.2 లక్షల విలువైన ద్విచక్ర వాహనాన్ని స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు చేసి ఇచ్చారని వెలుగులోకి వచ్చింది. నిందితుల బ్యాంకు స్టేట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారి డ్రైవర్ వాంగ్మూలాన్ని విచారణ అధికారులు నమోదు చేశారు.

సీఎం పర్యటన అనంతరం..

సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. హనుమకొండ కలెక్టరేట్‌లో సీఎం నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న ఆర్డీవో దత్తు అనంతరం తన కార్యాలయానికి వచ్చినట్లు తెలిసింది. సుమారు రాత్రి 7గంటల తర్వాత ఏసీబీ అధికారులు దత్తును అదుపులోకి తీసుకుని తమ వెంట తీసుకెళ్లినట్లు సమాచారం. అసిఫాబాద్ భూసేకరణలో పరిహారం పంపిణీకి సంబంధించిన అక్రమాల్లో ఏసీబీ అధికారులు శనివారం ఆర్డీవో దత్తుతోపాటు ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో డిప్యూటీ తహసీల్దార్ మేస్రం నాగోరావు, వెంచర్ చేసిన వ్యాపారుల్లో ఇద్దరితో కలిపి మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఏసీబీ కరీంనగర్ డీఎస్పీ రమణమూర్తి వెల్లడించారు. ఈ అంశం రెవెన్యూశాఖలో కలకలం రేపింది.

మరో ఏడాది పాటు 'స్మార్ట్‌సిటీ'

2025 మార్చి 31 వరకు కేంద్రం పొడిగింపు

వరంగల్, జూన్ 30 : స్మార్ట్‌సిటీ మిషన్ పథకాన్ని మరో ఏడాది పాటు కేంద్రం ప్రభుత్వం పొడిగించింది. జూన్ 30తో ఐదేళ్ల స్మార్ట్‌సిటీ మిషన్ పథకం ముగిసిన నేపథ్యంలో 2025 మార్చి 31 వరకు పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి స్మార్ట్‌సిటీ పనుల్లో చాలా వరకు పూర్తి కాలేదని, ఈ పథకాన్ని ఏడాది పాటు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్‌లో 47 అభివృద్ధి పనులు మాత్రమే పూర్తయ్యాయని, రూ. 518 కోట్లతో చేపట్టిన మరో 66 పనులు పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రికి వివరించారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఏడాది పాటు పొడిగించింది. కాగా, ఈ పథకంలో కొత్త అభివృద్ధి పనులకు అవకాశం లేదని కేంద్రం స్పష్టం చేసింది. గతంలో స్మార్ట్‌సిటీ బోర్డులో ఆమోదం పొందిన పనులను మాత్రమే చేపట్టాలని సూచించింది.సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించింది. కొనసాగుతున్న అభివృద్ధి పనులకు నిధులను సెప్టెంబర్ వరకు విడుదల చేస్తామని తెలిపారు. ఫస్ట్ కం ఫస్ట్ పద్ధతిలో నిధుల విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ కావ్య

హనుమకొండ : స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితిని 2025 మార్చి 31వ తేదీ వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ప్రజలకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందనున్నాయని పేర్కొన్నారు.

డాక్టర్స్ డే శుభాకాంక్షలు